నవతెలంగాణ
మహబూబ్‌నగర్ 1
మంగళవారం | డిసెంబర్ 19, 2023 | www.navatelangana.com

రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

• మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వారం రోజులలోనే ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆందోళనలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక న్యూ టౌన్ లో గల పార్టీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో ఆటో డ్రైవర్లపై ప్రత్యక్షంగా ప్రభావం పడిందని తెలిపారు. వివిధ బ్యాంకులు ఫైనాన్స్ కంపెనీ రుణ సౌకర్యం ద్వారా తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్న ఆటో డ్రైవర్లకు ఏ నిర్ణయం ఎంతో ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. పక్క రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు ప్రతినెల 12 వేల చొప్పున ఇస్తున్న మాదిరిగా ఇక్కడ అంతకు పెంచి వారికి ఇవ్వాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల అందరూ ఆందోళన చెందొద్దని ఆత్మహత్య చేసుకుంటామని ఆలోచన చేయొద్దని ధైర్యంగా ప్రభుత్వంతో పోరాడి సాధించుకుందామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మంత్రి సోదరుడికి ముందస్తు బెయిల్ మంజూరు



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

రాష్ట్ర మాజీ ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్ తో పాటు, మరికొందరికి మహబూబ్ నగర్ జిల్లా కోర్టు ముందస్తు బెయిల్ ను మంజూరు చేసింది. సోమవారం జిల్లా స్పెషల్ కోర్టులో లొంగిపోయిన ఆయనకు జడ్జి ముందస్తుబేయిల్ మంజూరు చేసింది. ఎన్నికల రోజు, ఎన్నికలు జరిగిన రెండు రోజులకు ఎన్జీవో మాజీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, తెలంగాణ పిఆర్టియు మాజీ జిల్లా అధ్యక్షుడు గట్టు వెంకటరెడ్డి పై దాడి జరగడంతో పాటు రాజేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి హంగామా సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. బాధితులు మహబూబ్ నగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీకాంత్ గౌడ్ తో పాటు మరో 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇద్దరిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు పంపిన విషయం పాఠకులకు విదితమే. ఈ సంఘటనలు జరిగినప్పటి నుండి అప్ స్కాండింగ్ లో ఉన్న శ్రీకాంత్ గౌడ్ ముందస్తు మేలు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మొదటి తరగతి మెజిస్ట్రేట్ శ్రీకాంత్ గౌడ్,అతని అనుచరులకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం శ్రీకాంత్ గౌడ్ తో కోర్టుకు హాజరై బెయిల్‌ను తీసుకున్నారు.

కరాటేకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేలా కృషి చేయాలి



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

కరాటే విద్యను ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేలా తమవంతు కృషి చేయాలని కోరుతూ సోమవారం పలువురు కరాటే మాస్టర్లు హైదరాబాద్ లో కరాటే ఇండియా ఆర్గనైజేషన్స్ తెలంగాణ అధ్యక్షుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో కరాటేను. రాష్ట్రంలో అభివృద్ధి పరిచేందుకు, గుర్తింపు విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరారు. రాష్ట్రంలో కరాటేను నమ్ముకున్న కరాటే మాస్టర్లకు న్యాయం చేయాలని వారు కోరారు. టీపీసీసీలో కీలకబాధ్యతలు వహిస్తున్న మహేష్ కుమార్ గౌడ్‌ను డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలంబబిన్ ఉమర్, నేషనల్ వైస్ చైర్మన్ ఆర్.మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు.కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అమ్రేష్, శేఖర్, ఎస్ కే.మోసీన్, ఫహీం, సలీం, అంజన్ ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ఓ,ఎస్ఐ,జీటీ నారాయణ క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

• కొత్తకోట పోలీస్ స్టేషన్లో విద్యార్థి నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ - మదనాపురం

కొత్తకోట ఎంఈఓ కృష్ణయ్య, ఎస్సై నాగశేఖర్ రెడ్డి, జీటీ నారాయణ పాఠశాల కోచింగ్ సెంటర్, హాస్టల్ యాజమాన్యం , ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్స్ పై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి,గ్రాడ్యుయేట్ అసోసియేషన్ సెక్రటరీ భరత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ప్రశాంత్, రాజేష్ తదితర నాయకులు సోమవారం కొత్తకోట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కోట మండలం లోని జీటీ నారాయణ పాఠశాల మరియు కోచింగ్, హాస్టల్, కు విద్య శాఖ అనుమతి లేకున్నా నడుపుతూ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా వేదిస్తూ చదివిన తరగతినే మళ్ళీ మళ్ళీ చదివిస్తూ ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్ నుంచి 2016 - 2017 విద్య సంవత్సరంలో 4,6,7 తరగతులు చదివినట్లు గా బోగస్ బోనఫైడ్స్ ఇచ్చారని విద్యాశాఖ అధికారులు ఎంక్వరీ చేసి నిర్ధారించి 3జూలై 2021న సిజ్ చేశారు

ఎంఈఓ , ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి కి లిఖితపూర్వకంగా జి.టి నారాయణ పాఠశాల కోచింగ్ సెంటర్, ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్ పై ఫిర్యాదు చేశారు. కానీ నాగశేఖర్ రెడ్డి చర్య తీస్కోకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తర్వాత జీటీ నారాయణ పాఠశాల ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్ సిజ్ చేసిన గది గోడకుల్చి మరో డోర్ ఏర్పాటు చేసి యధావిధిగా పాఠశాలను చట్ట విరుద్ధంగా నడుపుతున్నారని డీఈఓకు ఫిర్యాదు చేశారు. డీఈఓ, కొత్తకోట ఎంఈఓ ని ఎంక్వరీ కి వేయగా కొత్తకోట ఎంఈఓ గారు ఎంక్వరీ చేసి ఎంక్వరీ రిపోర్ట్ విద్యాశాఖ అధికారులకు ఇవ్వకుండా జీటీ నారాయణ, ఎస్‌జీ కాన్సెప్ట్ స్కూల్స్ కె వత్తాసుపలుకుతూ 5 నెలలు రిపోర్ట్ దాచిపెట్టారని తెలిపారు. ఆతర్వాత కలెక్టర్‌కి ప్రజావాణి లో కొత్తకోట ఎంఈఓ పై క్రిమినల్ కేసు నమోదు చెయ్యాలని, ఎంక్వరీ రిపోర్ట్ దాచిపెట్టారని పిర్యాదు చేసామని, కలెక్టర్ గారు కొత్తకోట ఎంఈఓ గారిని ఎంక్వరీ కి వేశారు. ఆమరుసటి రోజే ఎంఈఓ 5 నెలల నుండి దాచిన ఎంక్వరీ రిపోర్ట్‌ను డీఈఓ, ఆఫీస్‌లో ఇచ్చారు. తర్వాత ఎంఆర్ఓఎంక్వరీ చేసి డీఈఓ,ఎంఆర్ఓ, మున్సిపల్ కమిషనర్, స్థానిక ఎస్సై నాగశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో సీజ్ చేశారు. అయినా జీటీ నారాయణ, ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్ ఎదురుగా మరో రూమ్ లో నడిపించడంతో మేము కలెక్టర్ గారికి పిర్యాదు చేయగా మళ్ళీ ఎంఆర్ఓని ఎంక్వరీ కి వేశారు .ఇలా బోగస్ బోనఫైడ్స్, ఇల్లీగల్ గా నడుపుతున్న స్కూల్స్ పై చర్య తీస్కోకుండా అక్రమాలకు పాల్పడ్డ ఎంఆర్ఓ,ఎస్ఐ,జీటీ నారాయణ ,ఎల్‌జీ కాన్సెప్ట్ స్కూల్స్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసు లు నమోదు చేయాలన్నారు. విద్యార్థులను, వారి భవిష్యత్తును కాపాడాలని లేనిపక్షంలో సిఎం రేవంత్ రెడ్డిని ప్రజావాణిలో కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు అపెక్స్ పాఠశాల విద్యార్థి ఎంపిక



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాజస్తాన్ రాష్ట్రంలో వచ్చేనెల 9 నుంచి 13 వరకు జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని అపెక్స్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి పారిజాత ఎంపికైంది. ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టులో చోటు దక్కించుకుంది. పారిజాతను సోమవారం పాఠశాలలో డైరెక్టర్ రామారావు, ఏఓ నాగమణి, ప్రధానోపాధ్యాయులు చైతన్యరెడ్డి అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు మహ్మద్ ఉస్మాన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చలికి గజగజ



- రాత్రి పగలు వణుకుడే
- పడిపోతున్న రాత్రి పగలు ఉష్ణోగ్రతలు
- కనిష్ట స్థాయికి పడిపోతున్న వైనం
- నల్లమలలో 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- నది తీరప్రాంతాలది అదే పరిస్థితి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు చలితో వనికి పోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడు తున్నారు. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతం తో పాటు నది తీర ప్రాంత ప్రజలు వణికిపతున్నారు. ఏజెన్సీ వాసులు రాత్రి పగలు నేగెడు పెట్టి చలి కాచుకుంటున్నారు. అత్యల్పంగా 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో వారం రోజుల పాటు ఇవే ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలున్నాయి. దీర్ఘకాలికంగా చలి తీవ్రత ఉండటం వల్ల చిన్నారులు వృద్ధులు అస్తమా రోగగ్రస్తులు అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని పలువురు తెలిపారు.

నవ తెలంగాణ- మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. జిల్లా భౌగోళిక పరిస్థితులు అతి శీతల పరిస్థితులకు అనుగుణంగా ఉంటాయి. సాధారణంగా వేసవికాలంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే నల్లమలలో చలికాలం నాటి పరిస్థితులు మరీ దుర్భరంగా ఉంటాయి. అక్కడ పగలు ఉష్ణోగ్రతల సైతం అత్యల్పంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో నల్లమల చెంచులు గిరిజనులు గజ గజ వనికి పోతున్నారు. అమ్రాబాద్, పదర ,బల్మూరు ,లింగాల అచ్చంపేట కొల్లాపూర్ ,తదితర ప్రాంతాలలో నల్లమల అటవీ విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో 75 చెంచు పెంటల్లో 7,000 పైగా చెంచులు నివసిస్తున్నారు. గిరిజనులు గిరిజనేతరులు 50 వేలకు పైగా ఉంటారు. వీరికి అడవి ఉత్పత్తులు తప్ప వేరే జీవనోపాధి లేదు. తాటాకు అడవి గడ్డితో వేసుకున్న గుడిసెలోనే నివసిస్తున్నారు. వీరు చలి వర్షాకాలంలో గుడిసెల్లో నెగడు పెట్టుకొని నిద్రిస్తుంటారు. నేగడ ద్వారా వచ్చే మంట వల్ల గుడిసె అంటుకొని కాలిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల వీరికి 70 ఏళ్ల స్వతంత్ర కాలంలోనూ ఇప్పటికీ పక్కా ఇండ్ల నిర్మాణానికి నోచుకోలేదు. ఇక తుంగభద్ర కృష్ణ నది పరివాహక ప్రాంతాలైన వనపర్తి ,ఇటిక్యాల ,అలంపూర్, పెబ్బేర్, గద్వాల మండలాల పరిధిలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. నారాయణపేట కృష్ణ మండలం పరిధి సైతం చలి అధికంగానే ఉంటుంది. నల్లమల కృష్ణానది పరివాహ ప్రాంతాలలో14 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దుందుభి నది పరివాహక ప్రాంతమైన నాగర్ కర్నూల్ జడ్చర్ల లో సైతం చలి తీవ్రంగానే ఉంటుంది.



సాయంకాలం నాలుగు దాటిందంటే చాలు చలి మొదలు పెడుతుంది. ఉదయం 8 దాటినా వణుకుడు వదలదు. అత్యల్ప ఉష్ణోగ్రతల వల్ల చిన్నారులు వృద్ధులు మంచం పడుతున్నారు. ఆస్తమా ఉన్న రోగగ్రస్తులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు ఆస్పత్రుల కోసం వెళ్తున్నారు.

ఇక నల్లమల్ల చెంచులకు మాత్రం ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడం చేత అడివిలోని కాయ పసరు తోనే నయం చేసుకుంటున్నారు. నల్లమల లోనే కాదు మైదాన ప్రాంతంలో సైతం ఎక్కువ మందికి ఆవాసాలు లేవు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు లక్షల మందికి సొంత ఇల్లు లేవు. వీరంతా పూరి గుడిసెలు తాటాకు గుడిసెలు రాతితో తయారు చేసుకున్న చిన్న చిన్న ఇండ్లలోనే నివసిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సొంత ఇంటి నిర్మాణం చేసి చలి నుండి కాపాడాలని పలు పార్టీలు కోరుతున్నాయి.

చలి నుండి ప్రజలను కాపాడాలి

నల్లమల అటవీ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. అత్యల్పంగా 14 డిగ్రీలకు చేరాయి. దీంతో చెంచులు గిరిజనులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. వీరికి సొంత ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలి. తాత్కాలికంగా చలిని తట్టుకునే బట్టలు దుప్పట్ల ను సరఫరా చేయాలి. తాత్కాలిక ప్రయోజనాలతోపాటు జీవితాలిక అవసరాలను చేకూర్చే చర్యలు తీసుకోవాలి.

శంకర్ నాయక్ గిరిజన సంఘం నాయకులు నాగర్ కర్నూల్

స్మశాన వాటికను కూల్చిన వారిపై అట్రాసిటీ కేసులు పెట్టండి



నవ తెలంగాణ మహబూబ్ నగర్

నవాబ్ పేట మండలం ఇప్పటూరు గ్రామంలో వాగు అవతల ఉన్న దళితుల స్మశాన వాటికను జెసిపి తో కూల్చివేసిన ఆధిపత్య కులం నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డీ ఎస్ యూ కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేసి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల అధ్యక్షులు ఆనంద్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టంకర రాములు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జెసిబి తో కూల్చేసిన ఆధిపత్య కులాలకు చెందిన కత్తెర కృష్ణయ్య, శివకుమార్, యాదయ్య వారు ఇలాంటి సంఘటనకు పాల్పడ్డారని తెలిపారు. వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి, దళితుల స్మశాన వాటికను దళితులకు తిరిగి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. గత 20,30 సంవత్సరాల నుంచి ఇప్పటూరు వాగవతల చనిపోయిన దళితులను అక్కడ పూడుస్తున్నారు. ఈ స్థలం మాది అంటూ ఆధిపత్య కులాలకు చెందిన కత్తెర కృష్ణయ్య, శివకుమార్, యాదయ్యలు, ఈనెల 9వ తారీఖున జెసిబి తీసుకొచ్చి దళితుల స్మశాన వాటికను ధ్వంసం చేసినారు కావున వీరు పైన ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దళితుల స్మశాన వాటిక దళితులకు అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటూరు గ్రామానికి చెందిన కొంతమంది రాజాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది ఇసుక దందా కోసం స్మశాన వాటికను ఆక్రమించుకోవాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు అన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే అన్ని సంఘాలను కలుపుకొని పరిష్కారమై వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, కే మహేశ్వర్ చంద్రశేఖర్ యాదగిరి ఇస్తారయ్య లక్ష్మయ్య సత్తయ్య పాల్గొన్నారు.

కోయిలకొండ దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, మహబూబ్నగర్ లో కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంపై మండల కేంద్రంలోని షా అబ్దుర్ రహెమాన్ దర్గాలో కాంగ్రెస్ నాయకులు మక్సూద్ హుస్సేన్, మొయిన్‌అలీ ఆధ్వర్యంలో సోమవారం కందూర్లు చేసి పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విందు ఏర్పాటు చేశారు.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మతపెద్దలు దువా చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, ఖాజి గౌస్ మొహియొద్దీన్, మదీనా మజీద్ కమిటీ అధ్యక్షుడు అవద్ బిన్ బాహియాల్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అమరేందర్ రాజు, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, సయ్యద్ తఖీయోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ -మరికల్

మరికల్ మండల పరిధిలోని సోమవారం నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ పెద్ద చింతకుంట పూసలపాడు గ్రామాలలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూలు తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యాబోధన మెరుగ్గా ఉండేలా ఉపాధ్యాయులు కష్టపడాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. ఈ సందర్భంగా విద్యా బోధన మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలించి త్వరితగతిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ పుష్పవెనినీ సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అధ్యక్షుడు భరత్
- ఎస్సీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకి ఎంట్రుకలు, పురుగుల అన్నం







నవతెలంగాణ -మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ కళాశాల హాస్టల్ లో విద్యార్థులకి ఎంట్రుకలు, పురుగుల అన్నం పెడ్తున్న వార్డెన్ పుష్పవెని నీ సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అధ్యక్షుడు భరత్ అన్నారు. విద్యార్థులు అన్నం తినలంటేనే భయపడుతున్నారని అన్నారు ఎన్నిసార్లు వార్డెన్ కు సమాచారం కోసం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదన్నారు.డీడీ పండు సార్ కి సమాచారం ఇచ్చామన్నారు. వార్డెన్ నీ సస్పెండ్ చేయకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు.

ఎక్సైజ్ శాఖలో అవినీతి జలగలు..!

- విచ్చలవిడిగా బెల్టు షాపులు
- గ్రామాలల్లో ఏరులై పారుతున్న నాటు సారా
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ సిబ్బంది.
- బెల్టు షాపుల నియంత్రణ సాధ్యమేనా



ఎక్సైజ్ శాఖలో కొంతమంది అధికారులు అవినీతి అక్రమాలకు అలవాటు పడి జలగలుగా మారి వ్యాపారులను పట్టిపీడిస్తున్నారు. విచ్చలవిడిగా పెరిగిపోతున్న మద్యం అమ్మకాలను నియంత్రించాల్సిన సిబ్బంది మామూళ్ల మత్తులో తూగుతున్నారు. దీంతో గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసిన వీధికో బెల్టు షాపు దర్శనమిస్తుంది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో మద్యం తో పాటు నాటు సారా ఏరులై పారుతుంది. నాటు సారా తయారీని అడ్డుకోవలసిన ఎక్సైజ్ శాఖ సిబ్బంది చూసి చూడనట్లు వదిలేస్తుండడంతో మారుమూల గ్రామాలలో అదేచ్ఛగా నాటసార అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

నవతెలంగాణ -కల్వకుర్తి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం బెల్టు షాపులను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బెల్టు షాపుల నియంత్రణ సాధ్యమ వుతుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రతి కిరాణా షాపులు, హెూటళ్లలో అదేచ్ఛగా మద్యం అమ్మకాలు కొనసాగి స్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. కొంతమంది ఎక్సైజ్ సిబ్బంది బెల్టు షాపుల వద్ద నెల మామూలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

-కల్వకుర్తిలో వందకు పైగానే బెల్టు షాపులు

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో వందకు పైగానే బెల్టు షాపులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ప్రతి కాలనీలో ఉదయం 5 గంటల నుంచి బెల్టు షాపులలో మద్యం అమ్మకాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బెల్టు షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ దుకాణం యజమానులు అందిన కాడికి దండుకుంటున్నారు. క్వార్టర్ మద్యం బాటిల్ పై 50 నుంచి 80 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. బీరు బాటిల్ మీద సైతం 30 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. ఫుల్ బాటిల్ మీద దాదాపు 200 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

-జోరుగా కల్తీ కల్లు అమ్మకాలు..

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో బెల్ట్ షాపుల తో పాటు కల్తీకల్లు అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. కొంతమంది ఎక్సైజ్ శాఖ సిబ్బంది కల్తీ కళ్ళు అమ్మే వ్యాపారుల వద్ద నెల మామూలు తీసుకుంటూ చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కల్తీకల్లు సేవించి ఎంతోమంది ప్రజలు తమ ప్రాణాలను సైతం పోగొట్టుకున్న సంఘటనలు అనేకం జరిగాయి. మున్సిపాలిటీ పరిధిలో ఏడు దుకాణాలలో కల్తీకల్లు అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నట్లు సమాచారం పట్టణంలో ఉన్న పలు దుకాణాలపై ఆకస్మికంగా దాడులు చేసి కల్లు నమూనాలను సేకరిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించాలి.

-విచ్చలవిడిగానాటు సారా ప్యాకెట్ల తయారీ

కరోనా వైరస్ విజృంభించిన తర్వాత నాటు సారా అమ్మకాలు గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఊరుకొండ మండలంలోని పలు తండాలలో కొంతమంది నాటు సారా ప్యాకెట్లు తయారుచేసి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏ గ్రామంలో చూసినా నాటసార ప్యాకెట్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి.

-అధికారులకు స్థాన చలనం లేదా..!

నిబంధనలకు విరుద్ధంగా ఒకే చోట ఏళ్ల తరబడి పనిచేస్తున్న కొంతమంది ఎక్సైజ్ శాఖ అధికారులు డబ్బు సంపాదన ధ్యేయంగా పనిచేస్తున్నారు. వారికి స్థాన చలనం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెండు నుంచి మూడు సంవత్సరాలలో బదిలీ కావలసిన అధికారులు ఆరు సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వహించడం ఏమిటన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో పలు నియోజకవర్గాలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహించడం కారణంగా వ్యాపారులకు అధికారుల మధ్య అవినాభావ సంబంధం ఏర్పడి విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించి ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అధికారులను వెంటనే బదిలీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా బెల్టు షాపులతోపాటు నాటు సారా అమ్మకాలను అరికట్టడానికి ఎక్సైజ్ శాఖ అధికారులు బిగించాల్సిన సమయం ఆసన్నమైంది.



ఫిర్యాదులను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గాంగ్వార్



వనపర్తి : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గాంగ్వార్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐ.డీ. ఓ.సీ. ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్. తిరుపతి రావు తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కరి ంచడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ రోజు మొత్తం (49) ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అంతకుముందు వనపర్తి జిల్లాకు అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గా నియ మితులై శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా అధికారుల సంఘం తరపున అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్‌కు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అదనపు కలెక్టర్ యస్. తిరుపతి రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యశాల ప్రారంభం



వనపర్తి రూరల్ : వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ హాస్పిటల్ ను సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు . పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వెంక టయ్య భాగ్యమ్మల కుమార్తె జి.లావణ్య నూతనంగా ఏర్పాటు చేసుకున్న డెంటల్ హాస్పిటల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక ఆర్టీసీ ఉద్యోగి కుమార్తె పట్టుదలతో చదివి పదిమందికి ఉపయోగపడే డెంటల్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్న ఈ కుటుంబంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఆర్థిక పరిస్థితులను సైతం తట్టుకొని మంచి స్థానాన్ని సంపాదించిన డాక్టర్ లావణ్య ఈ డెంటల్ హాస్పిటల్ నుంచి జిల్లా ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కౌన్సిలర్లు బ్రహ్మం చారి, వెంకటేష్, చీర్ల సత్యం సాగర్, లక్ష్మీ రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి ఆర్టిసి డిపో మేనేజర్ వేణుగోపాల్, రిక్కీజిల్లా కోఆర్డినేటర్ పిఆర్ సోమశేఖర్ పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికాసిత్ సంకల్పయాత్ర



ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని సోమవారం పిన్ని చర్ల, బాలకిష్టా పురం గ్రామాలలో వికాసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌దన్, సురక్ష యోజన, కిసాన్ సామాన్ నిధి ,అటల్ పెన్షన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలచే మన దేశాన్ని కాపాడే వారిని గౌరవిస్తామని, ఏకత్వాన్ని బలపరుస్తామని ప్రతిజ్ఞ చేయించారు, అనంతరం పంటలలో డ్రోన్ ద్వారా రైతులకు పంటలకు మందు పిచికారి చేయడాన్ని ప్రయోగాత్మకంగా చూయించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆ గ్రామ సర్పంచులు ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షులుగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూరు : పూర్వపు అమరచింత నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు కే వీరారెడ్డి కుమారుడు కే ప్రశాంత్ కుమార్ రెడ్డి సోమవారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు గాండ్లరఘు, మొబైల్ ఖాజా , జబ్బార్, వడ్డే నరసింహ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్ట మవు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వనపర్తి : వనపర్తి జిల్లా కేంద్రం పట్టణంలో ని 4 వ వార్డు బాల్ నగర్ కాలనీకి చెందిన సారాయి బాలస్వామి గుండెపోటుతో సోమవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ కౌన్సిలర్స్ బి వెంకటేశ్వర్లు, చీర్ల సత్యం సాగర్, విభూతి నారాయణ, లక్ష్మీ, రవి యాదవ్ ,షఫీ , ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ , వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి వెంకటేష్ , రఘు యాదవ్ , ఏర్పుల నరేందర్ , ఎండీ అస్లాం లతీఫ్ , శ్రీకాంత్ , ఆదిత్య , వినయ్ , దిలీప్ , తిరుపతయ్య , శంకరయ్య , నరేష్ , కార్తీక్ తదితరులు సారాయి బాలస్వామి మృతదేహానికి పూలమాలలు వేస నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రభుత్వం తరపున ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

వనపర్తి రూరల్ : ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగిపోయిన గోపాల్పేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మల్లేష్ సోమవారం ఎమ్మెల్యే బాధితుని నివాసంలో పరామర్శించారు. ఆయన ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచిస్తూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బాధితుడికి ఆర్థిక సహాయం అందించారు.

మంత్రికి ఘన సన్మానం

ఆత్మకూరు : రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ,బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ,రాష్ట్ర గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ , గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ బాలరాజు గౌడు, తదితరులు మంత్రికి శాలువా పూలదండతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



మైనార్టీల హక్కులను కాపాడాలి

- ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జబ్బార్

నవ తెలంగాణ - వనపర్తి

మైనారిటీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డీ. జబ్బార్ అన్నారు. సోమవారం మైనార్టీల హక్కుల దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డీ. జబ్బార్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనా ర్టీలకు మేడిపండు సంక్షేమాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ ఉగ్రవాద ఘటనలు జరిగిన, హింసాత్మక సంఘటనలు జరిగిన, వారిలో ముస్లిం పేర్లు కనిపించిన అందరి అనుమానపు చూపులు ముస్లింలపై ఎక్కుపెట్టబడతాయని, ముస్లిమేతర సమాజం నుంచి గుచ్చుకునే ప్రశ్నల ముళ్ల ముస్లింలను ఆత్మనూన్య తాభావంలోకి, అపరాధ భావంలోకి నెట్టేస్తున్నాయని అ న్నారు. సంఖ్యా రిత్యా భారత దేశంలో ముస్లింలు రెండో స్థానంలో ఉన్నప్పటికీ వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ఉన్నంత స్వేచ్ఛ కూడా ముస్లింలకు లేదనే అభిప్రాయం బలంగానే వినిపిస్తోందని పేర్కొన్నారు. అడుగడుగునా వారి దేశభక్తి శంకించబడుతుందని, ఎప్పటికప్పుడు తమ దేశభక్తిని రుజువు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, తాము ముందుగా భారతీయులం అని, ఈ మట్టిలో మట్టి, ఈ ధూళిలో ధూళి అణువణువునా భారతీయతను నింపు కున్న వారమని అయినా అనుమానపు చూపులు, రు జువులు నిత్య కృత్యంగా మారిందని, అణిచివే యబ డుతున్న గొంతుల ఆక్రందన అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ గొడవలు లే కుండా బతుకును వెళ్ళ మార్చాల ను కుంటాను, ఉన్నట్టుండి ఎందుకో మరి నగరాల నడి వీ ధుల్లో నా నెత్తురు తీర్థ స్నాన ఘట్టమవుతుంది అని కవి ఖాదర్ మోహినోద్దీన్ అన్నారని, అంతేకాదు వాళ్ల కలిసి పంచుకున్న ఊర్ల మధ్య నా రక్తం ఏరులై పారింది అని అంటాడని గుర్తు చేశారు. మెజారిటీ మత భావ జాలం వల్ల మైనారిటీలు ఎదుర్కొంటున్న వివక్ష, అణిచి వేతలు భారతమాత నుదుటిన ఎప్పటికీ చెరగని పుట్టు మచ్చగా మారాయని అన్నారు. భారతదేశంలోని సామాన్య ప్రజలకు ఉన్న సమస్యలన్నీ వారికి ఉన్నాయి అని, బీదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, వివక్ష, స్త్రీల పట్ల నిరాదరణ ఇవన్నీ ఈ దేశంలోనే ప్రజలందరికీ ఉన్న సమస్యలేనని కాకపోతే అనేక చారిత్రక కారణాలవల్ల బ్రిటిష్ పాలకులు, భారతదేశంలోని హిందూ ఉగ్రవాద ప్రచారకులు చేసిన దుష్ప్రచారాల వల్ల ఆత్మనూన్యత భావానికి, వ్యక్తిగత స్థాయిలోనూ, సాముదాయకంగానూ లోనవుతున్న ముస్లింల విషయంలో ఈ సమస్యలు మరింత తీవ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మీరు స్వేచ్ఛ నుండి



శాంతిని వేరు చేయలేరని, ఎందుకంటే ఎవరికి స్వేచ్ఛ లేకపోతే ఎవరూ శాంతిలో ఉండలేరని మాల్కం ఎక్స్ అన్నారని గుర్తు చేశారు. భారతదేశ జనాభాలో 15శాతం ఉన్న ముస్లింలు ఉద్యోగాలలో నామమాత్రంగా ఉన్నారని, మనుగడ కోసం పోరాడే స్థితికి వారు నెట్టబడుతున్నారని అన్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న మత, జాతి, లైంగిక జాతి లేదా భాషాపరమైన మైనార్టీల హక్కులను కాపాడేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 18న మైనార్టీల హక్కుల దినోత్సవం జరుపుకుంటారు అని గుర్తు చేశారు. ఈరోజు మైనారిటీ సంఘాలు, మూలాలు ఎదుర్కొంటున్న సవాళ్ల, సమస్యలపై దృష్టి పెడుతున్నాయని, మైనార్టీలలోని వివిధ రకాల వర్గాల పట్ల అన్ని రకాల వివక్షలను తొలగించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్న రోజు ఇది అని, ఎటువంటి వివక్ష లేకుండా మైనార్టీ సమూహాల హక్కుల గురించి వారికి అవగాహన కల్పించడం నేటి లక్ష్యం అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆవాస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.మునురుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డీ.గయాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను దరిచేరనివ్వొద్దు : ఎమ్మెల్యే

వనపర్తి రూరల్ : దళారీ వ్యవస్థను దరిచేరనివ్వకూడదని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దమందడిలో సర్వసభ్య సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో చిన్న పని నుంచి మొ దలుకోని ముఖ్యమంత్రి స్థాయి వరకు ఏ పని కావాలన్నా పైరవీలు చేయవలసి వచ్చేదని, ఇకపై పైరవీ కారులను ఎవరిని దరి చేరిని వ్వకూడదని అన్నారు. దళారీ వ్యవస్థ ఎక్కువ వుతుందని ఈ వ్యవస్థను ఎవరు కూడా దరిచేరని వ్వకూడదని,పాలకుల్లా కాకుండా సేవకుల్లా పనిచే యాలని, నేను కూడా నియోజకవర్గానికి ఒక సేవ కుడి లాగానే పనిచేస్తానని ప్రజాప్రతినిధులకు సూచి ంచారు.గ్రామాలలో సర్పంచులు, ఎంపీటీసీలు చేపట్టిన పనులకు సంబంధించి నిలిచిపోయిన బిల్లుల రికార్డు వెంటనే పూర్తి చేయాలని ఆదేశి ంచారు. గత ప్రభుత్వ హాయంలో ఎక్కడ కూడా ప్రోటోకాల్ అనేది పాటించలేదని, పాలన మొత్తం ఇష్టానుసారంగా కొనసాగించారని విమర్శించారు. నేటి నుంచి వనపర్తి క్యాంపు కార్యాలయం ప్రజాభవనంగా కొనసాగుతుందని పార్టీలకతీతంగా ఎవ్వరైనా ఇక్కడికి వచ్చి వెళ్లవచ్చని అన్నారు. పెద్ద మందడి నుంచి వనపర్తికి వెళ్లే బీటీ రోడ్డును అత్యవసరంగా పునరుద్దరించాల్సిన అవసరం ఎం తైనా ఉందని, సంబంధిత అధికారులు వెంటనే అం దుకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వసభ్య సమా వేశంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ రఘు పతి రెడ్డి ఎంపీడీఓ అబ్జాలుద్దీన్ , సర్పంచులు వెంక టస్వామి, శ్రీనివాసరెడ్డి , రమేష్ యాదవ్ , రాధా కృష్ణ, జయంతి,సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



పురుగులన్నం వడ్డించడంపై ఆగ్రహం

గోపాల్పేట మండలం బండపల్లి పాఠశాలలో మధ్యాహ్నం భోజనంలో పురుగుల అన్నం వడ్డిం చారన్న విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సంబంధిత మండల విద్యాధికారి శ్రీని వాస్ గౌడ్ పై ఆగ్రహ వ్యక్తం చేశారు. సోమవారం గోపాల్పేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహి ంచిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరైన ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు వడ్డించిన పురుగులన్నంపై మండల విద్యాధికారి పొంతననేని సమాధానం చెప్ప డంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పురు గుల అన్నం వడ్డించడానికి కారణమైన వ్యక్తులపై దృష్టి సారించి వెంటనే పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయా ల్సిందిగా సంబంధిత అధికారులను ఆదే శించారు. చిన్నారి బాలబాలికలు అభ్యసించే అంగ న్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎం తైనా ఉందని గోపాల్పేట మండలంలో అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనం లేని వాటిని గుర్తించి అగ్రిమెంట్లను తయారు చేసే ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. తన గెలుపునకు కారణమైన గోపాల్పేట మండలంలోని ప్రతి ఒక్కరిని వార్డు మెంబర్ నుంచి జెడ్పీటీసీ వరకు అందర్నీ తన గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని అన్నారు. ప్రజల ఓట్లతో గెలుపోం పొందిన మనం ప్రజా ేవకుల్లా పనిచేద్దామని అందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకు రావాలని అధికారులను కోరారు. గత ప్రభు త్వంలో అధికారులు ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురయ్యారని ఇకనుంచి ఆ పరిస్థితి ఉండదని తెలిపారు. వనపర్తి లో ఉన్న ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పేరును మార్చి ప్రజా భవన్ గా మార్చడం జరిగిందని ఎప్పుడు ఎవరికీ ఎలాంటి సమస్యలు ఉన్న మనం కూర్చుని చర్చించు కోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి , ఎంపీడీవో హుస్సేం, రఘు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ , మండల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు కె. కాశప్ప

నారాయణపేటటౌన్ : దివ్యాంగుల పునర్వస కేంద్రాల్లో పనిచేస్తున్న వారి సమస్యలపై వికలా ంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు కే. కాశప్ప ఆధ్వర్యంలో సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ (పిడి) గోపాల్ నాయక్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కే. కాశప్ప మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఎస్ ఈ ఆర్ పీ ద్వారా 5 కేంద్రాలలో 15 మంది విధులు ఈఐసీఆర్పీ గా,కార్యకర్తగా, ఆయ లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత 17 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచే స్తున్నారని, ప్రస్తుతం రూ. 5 వేలు నెలకు ఇస్తున్నా రన్నారు. ఈ వేతనం వస్తుందని వచ్చే పింఛన్ బంద్ చేశారు. దీంతో మా కుటుంబాల పోషణ భారంగా మారిందని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి, వేతనం ఇస్తున్నాం అనే కారణంతో పింఛన్ బంద్ చేశారు. అట్టి పెన్షన్ వెంటనే పునారుద్దరించాలని కోరారు. దివ్యాంగుల పునర్వాస కేంద్రాల్లో భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసా య కార్మిక సంఘం జిల్లా నాయకులు హనుమంతు,



ఈఐసీఆర్పి కె.మంగమ్మ ,అమృత, అలవేలు,సుజాత, లక్ష్మి నర్సమ్మ కార్యకర్తలు శకుంతల, సి.మహేశ్వరి, ఎల్లమ్మ, వెంకటమ్మ జి. మానెమ్మ, అయలు జే.లక్ష్మి వెంకటమ్మ ఏ.ఈశ్వరమ్మ, గోవిందమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కాదు.. ఆత్మవంచన : బీఆర్ఎస్

వనపర్తి రూరల్ : ఆత్మగౌరవం కాదు.. ఆత్మవంచన చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ గట్టి యాదవ్ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులస రమేష్ గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పెద్దమందడి జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గట్టి యాదవ్ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులస రమేష్ గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పెద్దమందడి జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అహంకారానికి ఆత్మాభిమానానికి జరిగిన ఎన్నికలలో ఆత్మ అభి మానం గెలిచిందని అంటున్నారని ఆత్మాభిమానం మాదని ఆత్మవంచన మీదని అన్నారు. వనపర్తి ధ్వంసమైందని అంటున్నారని, అయింది ధ్వంసం కాదు నవనిర్మాణం జరిగిందని, అహంకారం కాదు.. మాది ఆత్మ సాక్షిగా పనిచేశామని, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తావా లేదా ప్రజాప్రతినిధులను అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తావా అని అన్నారు. ఎమ్మెల్యే నియో జకవర్గాన్ని అభివృద్ధిలో పోటీపడి ఏ విధంగా ముం దుకు తీసుకెళ్లాలో చెప్పకుండా తన చుట్టూ ఉన్న సవాలను కప్పి పుచ్చుకోవడానికి వ్యక్తిగత దూష ణలకు పాల్పడటాని బీఆర్.ఎస్ పార్టీ తీవ్రంగా ఖండి స్తుందని అన్నారు. మంత్రిగా ఎదిగిన వ్యక్తిని ఒక మంత్రి అని చూడకుండా వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని, నిరంజన్ రెడ్డి వెంట ఉండి డబ్బులు సంపాదించుకున్నప్పుడు అవినీతి గుర్చి మాట్లాడలేదని వారు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మీకు శంకరగిరి మాన్యాలే గుర్తు పెట్టుకోవాలని, ఇకమీదట వ్యక్తిగత దూషణలకు పాల్పడిన నిరంజన్ రెడ్డి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా మాట్లాడిన సహించే ప్రసక్తే లేదని చట్ట ప్రకారం చేయవలసిన పని చేస్తామన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కాదు ప్రజాభవన్ అన్నావు ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలను పరిరక్షించడం వంటివి చేయాలి కానీ ఓడిపోయిన వ్యక్తులపై అహంకారంతో మాట్లాడాను సరికాదని ధర్మానికి



అధర్మానికి జరిగిన ఎన్నికలలో ధర్మం ఓడిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన నీకు వాస్తవంగా కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం లేదని, ఇప్పటికి కూడా చిన్నారెడ్డిని కలవకుండా పార్టీ సీనియర్ నాయకులను పట్టించుకోకుండా ఉన్నావని అన్నారు. భూకబ్జాల విషయంలో ఆరు నెలల నుంచి మాట్లా డుతున్నామని వాటిని ఇప్పటికి కూడా నిరూపించలేదని వంద రోజులలో మా నా యకునిపై నిరూపించకపోతే రాజీనామా చేయాలన్నారు. నల్లచెరువు కాం ట్రాక్టర్ నీవే కదా 8 కోట్ల పనులకు గాను రూ.11 కోట్లు ఏ విధంగా తీసుకున్నావు నల్లచెరువు కట్టకు మట్టి ఎక్కడి నుంచి తీసుకోవచ్చావని, బుద్ధారం లెఫ్ట్ రైట్ కెనాల్ కు రూ.20 కోట్ల 60 కోట్లకు ఎందుకు పెరిగిందని మాజీ మంత్రి దగ్గర ఉండే అన్ని పనులు చేసి తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్నామని మాజీ మంత్రిని తప్పుదోవ పట్టించి అవినీతి చేసింది మీరేనని అన్నారు

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

వీపనగండ్ల : పానగల్, పనగండ్ల, చిన్నంబావి మండలాల మామిడి రైతులకు వీపనగండ్లలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఉదయం10 గంటలకు మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని మండల ఉద్యమ శాఖ అధికారి కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు . ఆయా మండలాల్లోని గ్రామాల రైతులు మామిడి తోటల్లో సత్యరక్షణ చర్యలు యాజమాన్య పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం శాస్త్రవేత్తలు హాజరై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మామిడి తోటల రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

21న వికలాంగులకు జిల్లాస్థాయి క్రీడలు

వనపర్తి : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి వికలాంగుల క్రీడలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రామ మహేశ్వర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పదిహేళ్ల నుంచి 16 ఏళ్ల లోపు వికలాంగులకు జూనియర్ స్థాయిలో, 17 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వారికి సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీలలో పరుగు పందెం, షార్ట్ పుట్టు, క్యారమ్స్, జావలిన్ త్రో, చదరంగం క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను స్త్రీ, పురుషులకు వేరువేరుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వికలాంగులు 21వ తేదీన ఉదయం పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

నమోదైన కేసుల్లో..

పారదర్శకంగా విచారణ చేపట్టాలి : ఎస్పీ



జోగులాంబ గద్వాల : వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పారదర్శకంగా విచారణ చేపట్టి ఆయా కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచాలని ఎస్పీ రితిరాజ్ పో లీసు అధికారులకు సూచించారు. సోమ వారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని సమావేశ హల్‌లో సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో ఎస్పీ నెల వారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహి ంచారు. ఈ సదర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల పూర్త యినందున పోలీస్ అధికారులు వ్యవస్థీకృత నేరాల పై దృష్టి పెట్టాలని , నమోదైన ప్రతి కేసులో పారదర్శకమైన లోతైన విచారణ చేపట్టాలని అన్నారు . పోలీస్ స్టేషన్ ల వారిగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను, యూఐ కేసుల వివరాలను పరిశీలించారు. గ్రేవ్ కేసులలో యూఐ లో ఉండడానికి గల కారణాలను పరిశీలించి కేసులను చేదించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలను, నమో దైన పోక్సో కేసు వివరాలను పరిశీలించి ఆయా కేసులలో శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాంటేస్టెడ్ కేసులు కోర్టు ట్రయల్స్ నడిచే సమయంలో సాక్షులను పకడ్బందీ గా బ్రీఫ్ చేస్తు ఎప్పటికప్పుడు కేసులకు సంభందించిన విషయాలను బాధితులకు అప్డేట్ చేస్తూ కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని మరింత పెంచాలని సూచించారు. గత నెలలో కొన్ని కేసులలో నిందితులకు శిక్షలు పడగ సంబంధిత ఎస్సై లను, కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులను అభినందించారు. అలాగే మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలైన ఫోక్సో కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల కేసులను ఛేదించడంలో పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకు తగిన ప్రణాళిక రచించి ముందుకెళ్లాలని అన్నారు. దొంగతనాల కేసులలో నిందితులను లోతుగా విచారించాలని , వీలైనంత త్వరగా అయా కేసులను ఛేదించాలని ఆదేశించారు. అందుకు సీసీ కెమెరాలని పరిశీలించాలని, అలాగే ఎక్కడైనా పనిచేయని కెమెరాలను వెంటనే రిపేర్లు చేయించి నిఘా కోసం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా కేసులకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్స్, అరెస్ట్ లు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజా వాణి లో వచ్చిన ఫిర్యాదులు పై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెలలో నిర్వహించబోయే లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న కేసులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వేంకటేశ్వర్లు, డీసీ ఆర్బీ ఇన్స్పెక్టర్ శివ కుమార్, గద్వాల్, శాంతి నగర్ సీఐలు శ్రీనివాస్, శివ శంకర్‌లు జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు, ఐటీ సెల్ ఎస్సై రజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పది ఫిర్యాదులు

వనపర్తి రూరల్ : వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎస్పీ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 10 ఫిర్యాదులు అందాయని వాటిలో భూతగాదాలకు సంబంధించినవి మూడు, పరస్పర గొడవలకు సంబంధించినవి ఆరు, భార్యాభర్తలకు సంబంధించిన గొడవలు ఒకటి అందాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయా పోలీస్ స్టేషన్లో అధికారులతో మాట్లాడారు ఫిర్యాదుదారుల నుంచి అందినటువంటి ఫిర్యాదులను వెంటనే పరిష్కరి ంచా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిల్ వివాదాలను కోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
నాగర్‌కర్నూల్
మంగళవారం | డిసెంబర్ 19, 2023 | www.navatelangana.com

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ కే సీతారామారావు

నవతెలంగాణ- కందనూలు



నాగర్ కర్నూల్ జిల్లా ప్రజా వాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరి ంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కేసీతారామారావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజా వాణి కార్యక్రమం లో భాగంగా సోమ వారం ఐ.డి. ఒ.సి. ప్రజావాణి హాల్లో డిఆర్డిఎ పిడి నర్సింగ్ రావు, సిపిఓ భూపాల్ రెడ్డి లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా_డుతూ ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్ పెట్టకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సమస్యలు పరిష్కరించటంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ రోజు మొత్తం (92) ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, ఈడియం నరేష్, ధరణి ఆపరేటర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ప్రజావాణిలో 10 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి 10 ఫిర్యాదు దారులు వచ్చారు. ఫిర్యాదు దారులతో జిల్లా అడిషనల్ ఎస్పీ సి హెచ్ రామేశ్వర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

బాలాజీ సింగ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

నవతెలంగాణ -కల్వకుర్తి



తెలంగాణ ఉద్యమకారుడు, నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ కు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కౌన్సిలర్లుహామీ్ల, బాలు నాయక్,గోరేటి శ్రీనివాసులు, రజియాబేగం,ఎజాస్,చందన, విజయలక్ష్మి పద్మ, లక్ష్మి తదితరులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం కోసం బాలాజీ సింగ్ ఎంతగానో కృషి చేశారని పార్టీ అధిష్టానం ఆయన సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విదేశాలలో వ్యాపారం చేసుకుంటూ ఉండే బాలాజీ మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్రానికి చేరుకొని తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మల్లలమ్మ గోపుర నిర్మాణం పనులు ప్రారంభం

నవతెలంగాణ-తెలకపల్లి



మండల కేంద్రంలో వెలిసిన మేదరుల కులదైవం శ్రీ మల్లలమ్మ తల్లి గుడి గోపురం, శిఖర కలశం నిర్మాణ పూజా కార్యక్రమం వేదపండితులు శ్రీ సంతోష్, మండల కమిటీ అధ్యక్షులు ప్యారసాని రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గుడి గోపుర నిర్మాణ పూజ కార్యక్రమాలను ప్రారంభించినట్లు అధ్యక్షులు ప్యారాసాని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్యారసాని రమాకాంత్, జిల్లా అధ్యక్షులు ప్యారసాని కొండలయ్య లు పాల్గొని మల్లలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి పులి మల్లేష్, తెలకపల్లి మండలం సంఘము నాయకులు పిల్లి నారాయణ,బాలరాజు, బాలస్వామి,రాధాకృష్ణ, రుక్మయ్య, వెంకటయ్య,శిల్పి అయ్యప్ప స్వామి, చిన్నమ్మ, మంజుల,సంతోషి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు , హమాలీలకు విశ్రాంతి భవనాల నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

నవ తెలంగాణ- అచ్చంపేట



వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు హమాలీలకు విశ్రాంతిభవనలు నిర్మాణానికి కృషి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణం లోని మార్కెట్ యార్డ్ లో కమిషన్ దారులు , కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ. మార్కెట్కు ధాన్యం తెస్తున్న రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రాథమిక సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అరుణ, కమిషన్ దారులు గోవర్ధన్ మల్లారెడ్డి ఉమామహేశ్వరం కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ కొరివి శేఖర్, న్యాయవాది రాజేందర్, తదితరులు ఉన్నారు.

డీసెట్ -2023 లో ప్రవేశమునకు 27 వరకు గడువు

అచ్చంపేట రూరల్ : డి.ఇఐ.ఈడి,2023-25 విద్యా సంవత్సరమునకు మొదటి సంవత్సరంలో తెలుగు, ఆంగ్లము మరియు ఉర్దూ మాంధ్యములో అడ్మిషన్ కొరకు, ధృవపత్రముల పరిశీలన చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్ పెట్టుకొనుటకు డిశెంబర్ 22 నుండి డిశెంబర్ 27 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని మరియు ధృవపత్రముల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులు వారి వారి ధృవపత్రముల పరిశీలన చేసుకొనుటకు, డిసెంబర్ 20న విద్యార్థులందరు తమ ఒరిజినల్ ధృవపత్రములను మరియు జిరాక్స్ ప్రతులతో వచ్చి ధృవపత్రములు పరిశీలించుకొనుటకు అవకాశముందని మహబూబ్‌నగర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ మేరాజుల్లా ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కొరకు 9949993714కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు. ధృవపత్రాల పరిశీలనకొరకు గతంలో హాజరు కాని విద్యార్థులు డిశెంబర్ 20న మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలో హాజరుకావాలి. డీసెట్ -2023లో ఉత్తీర్ణతా ర్యాంకు సాధించి డిఇల్ ఇడి మరియు డిపిఎస్ఇ కోర్సుల కొరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చిన విద్యార్థులు డిశెంబర్ 22 నుండి డిశెంబర్ 27 వరకు గడువు వుందని తెలిపారు. డిశెంబర్ 30న మెరిట్ ఆధారంగా, రిజర్వేన్ ఆధారాంగా అభ్యర్థులకు సీట్లు కేటాయించ బడునని తెలిపారు. జనవరి 1 2024 నుండి జనవరి 3 2024 లోగా ఫీజు కట్టి అట్టి రిసిఫ్ట్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. జనవరి 5 2024 లోగా కాలేజి నందు రిపోర్ట్ చేయాలని, జనవరి 8న సీటు పొందిన అభ్యర్థులకు మొదటి రోజు కాలేజి తరగతుల సందర్భంగా సూచనలు చేయబడునని వివరించారు.

సీఎంకి ఆశాదీప్‌రెడ్డి శుభాకాంక్షలు



కల్వకుర్తి : కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయి రెడ్డి, మాడుగుల మాజీ ఎంపీపీ సూదిని రామిరెడ్డి తో కలిసి సీఎం చాంబర్ లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. రేవంత్ రెడ్డి రాకతో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. కల్వకుర్తి ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలపడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కల్వకుర్తి మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

పాస్టర్లకు బట్టలు,ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ - తిమ్మాజీపేట



మండల కేంద్రంలో ఉన్న హెూలీషాలేము చర్చిలో సోమవారం గ్రామానికి చెందిన విగల విజయ్ క్రిస్మస్ పండగ సందర్భంగా 15 మంది పాస్టర్లకు బట్టలు, ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా కేంద్రంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పాస్టర్లకు విగల విజయ్ దంపతులు గత ఐదు సంవత్సరాలుగా పాస్టర్ల దంపతులకు ప్రతి క్రిస్మస్ పండగకు బట్టల ను అందజేస్తున్నారు. అలాగే ప్రతినెల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో హెూలీ శాలెం చర్చి సంగం సభ్యులు ఉన్నారు.

ప్రజా నాయకుల్లారా సహనం పాటించండి..

- ప్రజాస్వామ్య యుతంగా జరిగే ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం.

నవతెలంగాణ - బల్మూరు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణ 50 వేల మెజారిటీతో గెలుపొందారు. టిఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు ఓడిపోయారు. ఈ క్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ వంశీకృష్ణ విజయోత్సవ సంబరాల సందర్భంగా కార్యకర్తలు నాయకులను అభిమానులను కలుసుకోవాలనే ఉద్దేశంతో హాజీపూర్ చౌరస్తాలో గత వారం రోజుల క్రితమే షెడ్యూల్ను ఖరారు చేసి ప్రకటించుకున్నారు. కార్యకర్తల సమావేశం కూడా అధిక సంఖ్యలో పాల్గొని సమావేశం జరుగుతున్నది. ఇదే రోజు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అచ్చంపేట పర్యటనకు రావడం పట్ల పలువురు రాజకీయ నాయకులు అభిమానులు విచారం వ్యక్తం చేశారు. తాను గుడి ప్రారంభోత్సవానికి లింగాల మండలం అంబటిపల్లికి వెళ్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ ఒకరోజు ముందుగానైనా లేదా మరుసటి రోజైనా మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తన ప్రోగ్రామ్ను పెట్టుకోవచ్చు కదా అంటూ చర్చించుకోవడం వినిపించింది. లేదా అంబటిపల్లికి వెళ్లాలంటే వేరే దారిలో తెలకపల్లి మీదుగా వెళ్లవచ్చు కదా అంటూ చర్చించుకోవడం వినిపిస్తుంది. రాజకీయాలు అన్నాక గెలుపు ఓటములు సహజమని కానీ ఇలాంటి ఘర్షణ ఆందోళనకర వాతావరణ పరిస్థితులను ఇరు పార్టీల వారు కల్పించకూడదు అని గుసగుసలు వినిపించాయి. ఏది ఏమైనాప్పటికీ మాజీ ఎమ్మెల్యే గారు ప్రస్తుత పరిస్థితులలో కొంచెం ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని,





ఘర్షణ వాతావరణానికి ఆందోళనకర పరిస్థితులను కల్పించరాదని పలువురు కోరుతున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు తమ విధులను నిర్వహించారని అందుకు మండల ప్రజలు కాంగ్రెస్ నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మరోసారి శాంతియుత వాతావరణంలో తన పర్యటనను కొనసాగించాలని టిఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాల ప్రజలు యువకులు కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా హాజీపూర్ చౌరస్తాలో కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైనప్పటికీ విషయం తెలిసి కొంతమంది అక్కడికి వెళ్లలేకపోయామని ఏ పరిస్థితులు ఎలా ఉంటాయో అని పోలేదని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అరెస్టు చేశారని తెలియడంతో అక్కడికి వెళ్లాలా వద్దా అని సందిగ్ధంలో కొందరు కార్యకర్తలు నాయకులు ఆలోచనలు పడ్డారు. ఏది ఏమైనాప్పటికీ అధికార ప్రతిపక్ష నాయకులు అచ్చంపేట నియోజకవర్గం లో ప్రజల శాంతి భద్రత కాపాడేందుకు పాటుపడాలని పోలీసులు ప్రజలు కోరుతున్నారు.

> ఎన్నికల బరిలో గెలిచి.. ఓడిపోయే వారిలో.. సహనం కూడా అంతే అవసరం. రాజకీయాలు అన్నాక హుందాగా వ్యవహరించాలి. ఇదేమి..! చిల్లరగా.. అంటూ విస్తు పోతున్నారు పలువురు. సోమవారం హాజీపూర్ ఆమనగల్ పోలీస్ స్టేషన్లో సంఘటనను దృష్టిలో పెట్టుకొని మండలంలోని పలువురు రాజకీయ అభిమానులు కార్యకర్తలు నాయకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకుల్లారా సహనం పాటించండి.. అంటున్నవిషయమై' నవ తెలంగాణ గమనం..

ఆటో కార్మికులకు ఉపాధి చూయించాలి: సీఐటీయూ

నవ తెలంగాణ- కందనూలు



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న రవాణా రంగ కార్మికులు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం పేరుతో రవాన రంగ కార్మికులు రోడ్డున పడ్డారని వారికి ప్రత్యాయమా మార్గాలు చూపాలని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఏవో గారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంపై 50 లక్షల మంది రవాణా రంగ కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. వీరి యొక్క సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని వారికి ఉపాధి చూపించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఉచితబస్సు ప్రయాణం పేరుతో మహాలక్ష్మి పథకం ప్రారంభించడం వల్ల రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న 50 లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆయన అన్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామాయ మార్గాలు చూపించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేల రూపాయలు ఫైనాన్స్ లు తీసుకొచ్చి వివిధ రకాల వాహనాలు తీసుకొచ్చిన కార్మికులు వాటిని నడపలేక ఆటో ఫైనాన్స్ కట్టలేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధంగా రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల కార్మికుల రోడ్డు పాలవుతున్నారని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు అందులో భాగంగా 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 12000 రూపాయలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా మాట ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేయకుండా కార్మికుల పొట్ట గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ యూనియన్లతో చర్చలు జరిపి సమస్యకు ముగింపు పలకాలని రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కురుమూర్తి ప్రధాన కార్యదర్శి పొదిల రామయ్య ఉపాధ్యక్షులు చింత శివకుమార్ ఆటో రంగాల యూనియన్ నాయకులు మల్లేష్ మైబు సైదులు మహేష్ శివ సుబ్బయ్య సిరాజ్ శ్రీను సుల్తాన్ ఖయ్యూం వేణుగోపాల్ కృష్ణ వేణుగోపాల్ రాఘవేంద్ర పరమేష్ వెంకటేష్ బాలస్వామి కృష్ణయ్య కురుమయ్య రాజు వెంకటేష్ కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

నవతెలంగాణ - అచ్చంపేట రూరల్



తెలంగాణలో ఏర్పడ్డ కాంగ్రెస్ కొత్త ప్రభుత్వంపై గంపెడు ఆశ తో ఎదురుచూస్తున్న ఆశ వర్కర్లు వారు సమస్యలు పరిష్కారం అవుతాయని, పాత బకాయిలన్నీ చెల్లించాలని ఆశిస్తున్నామని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం నా డు అచ్చంపేట మండలంలో ని టీఎన్జీవోస్ భవనంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత అధ్యక్షతన అచ్చంపేట నియోజకవర్గ స్థాయి తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్స్ ప్రాథమిక స్థాయిలో పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారని, కరోనా సమయంలో వారి సేవలు అమోఘమైనవని కొనియాడిన టీఆర్ఎస్ ప్రభుత్వం వారు కడుపునిండా మూడు పూటలు తినడానికి మాత్రం జీతం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులు సమ్మె చేసినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం వల్ల వారి ప్రతాపం ఓట్ల రూపంలో కనబడిందని, అచ్చంపేట మెజార్టీ చూస్తే అర్థమవుతుందన్నారు. ఏదేమైనా ఆశ వర్కర్లందరూ ఒకతాటిపై ఉండాలని రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే ఐక్య ఉద్యమాలకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, సైదమ్మ, భాగ్యలక్ష్మి, నిర్మల, శివ లీల, కల్పనా, సుజాత, అలివేల తదితరులు పాల్గొన్నారు.

అరెస్టుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న గువ్వల బాలరాజు

- వారంలో ఒకరోజు ప్రజాభవన్ లో ప్రజావాణి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

నవతెలంగాణ - అచ్చంపేట , అచ్చంపేట రూరల్



వెల్దండ పోలీస్ స్టేషన్ లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు క్షేమం కోసమే పోలీసులు అరెస్టు చేశారని, దీనిని గువ్వల బాలరాజు రాజకీయ కోణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడు. ఇది మంచి పద్ధతి కాదని గువ్వల బాలరాజుపై ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఫైర్ అయ్యారు. సోమవారం పట్టణంలోని ప్రజాభవన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గువ్వల బాలరాజు అహంకారము, అరాచకత్వం, నియంతృత్వ పోకడం వల్ల తన పార్టీ కార్యకర్తలు నాయకులు కోపంగా ఉన్నారని, తన పార్టీ కార్యకర్తలను కూడా చూడకుండా వారిపై తన అధికారాన్ని ఉపయోగించి సొంత పార్టీ కార్యకర్తలు ,నాయకులపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయించి వారి మీ మనోవేదనకు గురి చేశాడని, అట్టి కార్యకర్తలే బాలరాజుకు తగురీతిన బుద్ధి చెప్పాలని కోపంగా ఉన్నారని అన్నారు. గువ్వల బాలరాజు పై నమ్మకాన్ని కోల్పోయిన నియోజకవర్గం ప్రజలు తనను 50 వేల అత్యధిక ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిపించాలని అన్నారు. కౌంటింగ్ ముగింపు దశలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు సంయమనం పాటించాలని, ఎవరిపై ఎలాంటి ఆరోపణలు, కించపరిచే వ్యాఖ్యలు చేయకుండా గాంధీయవాద మార్గంలో మన పని మనం చేసుకుంటూ పోవాలని సూచించడం జరిగిందని గుర్తు చేశారు. 2017 నుండి 18 వరకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్‌అ ధికారాన్ని అడ్డం పెట్టుకొని అసైన్డ్ భూములపై చేసిన అవినీతిపై , ఏసిడిఎఫ్ నిధుల అవకతవకలపై చట్ట ప్రకారంగా విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని అన్నారు. గువ్వల బాలరాజు పై నాకు ఎలాంటి కోపం లేదని, తనకు సోదరుడు లాంటి వాడని నిర్మాణా త్మకమైన సలహాలిచ్చి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సీఎం రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సీనియర్ న్యాయవాది రాజేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసయ్య యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు గుద్దటి బాలరాజు, గిరి వర్ధన్ గౌడ్, అజయ్ యాదవ్, తదితరులు ఉన్నారు.

గ్రహణ మొర్రి శస్త్ర చికిత్స స్క్రీనింగ్ క్యాంపు విజయవంతం

నవతెలంగాణ- కందనూలు



సమగ్ర శిక్ష, తెలంగాణ మరియు బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పట్టణంలోని భవిత కేంద్రం నందు జిల్లా విద్యాశాఖ సోమవారం గ్రహణ మొర్రి శస్త్ర చికిత్సల కొరకు ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పాల్గొన్న జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ, 6 నెలల నుండి 50 సంవత్సరాల వయసు కల్గిన గ్రహణ మొర్రి భాదితులకు బసవతారకం హాస్పిటల్ వారు ఉచిత వైద్య సేవలను అందించడం అభినందనీయమని అన్నారు. శస్త్ర చికిత్స ద్వారా ఎంతో మంది పిల్లలు లబ్ది పొందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యా శాఖ కమ్యూనిటీ మోబిలైజషన్ అధికారి బర్పటి వెంకటయ్య గారు మాట్లాడుతూ, జన్యుపరమైన ఇబ్బంది వల్ల కలిగే ఈ సమస్యకు శాస్త్ర చికిత్సతో చక్కని పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బసవ తారకం హాస్పిటల్ డాక్టర్స్ జోషి, రాజేష్గారు బాధితులకు పరీక్షలు జరిపి, శస్త్ర చికిత్స అవసరమైనటువంటి వారిని గుర్తించి, వారికి శాస్త్ర చికిత్సలు నిర్వహించే తేదిలను తెలియజేశారు. ఈ ఆపరేషన్లను హైదరాబాద్ లోని బసవతారకం ఆసుపత్రిలో బసవతారకం హాస్పిటల్ లో ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, స్ట్రాంగ్ టీచర్ వెంకటేశ్వర శెట్టి, సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్లు ప్రకాష్ , రజవర్ధన్, రాఘవేందర్, రాజేందర్, మంజుల, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ- కందనూలు

తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహన్ సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వృక్ష శాస్త్రం సబ్జెక్టు బోధించటానికి అభ్యర్థులు ఈ నెల 20వ తేది సాయ ంత్రం 4:30 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు ఎం.ఎస్. సి బోటని పూర్తి ఉండి, కనిష్టంగా 55 శాతం మార్కులు కలిగి ఉండాలని మరియు నెట్, సెట్, పి.హెచ్. డి కలిగి ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రియారిటి ఇవ్వబడుతుందని తెలిపారు .ఇంటర్వ్యు తేదిని ఫోన్ ద్వార తెలియపరచటం జరుగుతుంది.

అయ్యప్ప పైడి పూజలో ఎమ్మెల్యే



నవతెలంగాణ- తాడూర్

అయ్యప్ప పైడి పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి అయ్యప్ప కి అతని చేతుల మీదగా అభిషేక కార్యక్రమాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గుడి ధర్మకర్త అనుపటి శ్రీని వాసులు కౌన్సిలర్ కొత్త శీను జడ్పిటిసి రోహిణి గోవర్ధన్ రెడ్డి సంద మల్లయ్య వెంకటయ్య కోటీశ్వర్ సాంబశివుడు వెంకటేష్ పాల్గొన్నారు.


రైతు బందు దరఖాస్తు ఫారాల సేకరణ

నవ తెలంగాణ కందనూలు

నాగర్ కర్నూల్ మండలంలోని వనపట్ల గ్రామంలో రైతు బందు దరఖాస్తు ఫారాల సేకరించారు..రైతులకు తెలియజేయునది కొత్తగా భూమి పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. 2023 యాసంగికి సంబంధించిన రైతులకు వారి బ్యాంకు ఖాతాలో రైతుబంధు డబ్బులు జమ చేయడం జరుగుతుంది. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ దరఖాస్తు ఫారానికి జత చేసి వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేయాలని తెలియజేయడమైంది, గ్రామాల వారీగా గతంలో దరఖాస్తు చేసుకున్నా రైతులు అదేవిధంగా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

నేడు ఊరుకొండకు ఎమ్మెల్యే రాక..

నవతెలంగాణ - ఊరుకొండ



జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి మంగళవారం ఊరుకొండ మండలానికి విచ్చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆయూబ్ పాష, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిఖిల్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటయ్య గౌడ్ లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊర్కొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రేవల్లి ఆయూబ్ పాష జడ్చర్ల ఎమ్మెల్యేగా జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు గెలిచిన వెంటనే రేవల్లి నుండి ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయానికి నడుచుకుంటూ వస్తామని మొక్కుకున్నారని.. ఆయూబ్ పాషాకు మద్దతుగా మొక్కు తీర్చుకోవడానికి పెద్దలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జడ్చర్ల నియోజకవర్గంలోని అవినీతి పరుల గుండెల్లో రైలు పరుగులెత్తిస్తున్న శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి మంగళవారం ఉదయం 10గంటలకు ఊరుకొండ మండలంలోని రేవల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని.. అక్కడి నుండి కాలినడకన ఊరుకొండ పేట శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారనీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నవ తెలంగాణ - బిజినేపల్లి

మండలంలోని ఖానాపూర్ గ్రామంలో వికసి త్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పథకాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలోని భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం పాలెం సమన్వయకర్త డాక్టర్ టి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న భూసార పరీక్ష పత్రాల పథకం గురించి రైతులకు వివరించారు. భూమిలో సహజంగా ఉన్న పోషకాలను వినియోగించుకొని రసాయన ఎరువులపై పెట్టి ఖర్చును తగ్గించుకోవడానికి భూసార పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలోని పాలెం యు బి ఐ బ్యాంక్ మేనేజర్ సందీప్ కెవికె శాస్త్రవేత్తలు రామకృష్ణ ,రఘు, వెంకటేష్ ,గ్రామ రైతులు పాల్గొన్నారు.



నర్సరీల పరిశీలన



మల్దకల్ : మండలంలోని అమరవాయి, దాసర్‌పల్లి, బిజ్జారం గ్రామ పంచాయతీలలో నర్సరీలను సోమవారం ఎంపీడీవో జీ. కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచా యతీకి పదివేల మొక్కల చొప్పున పెంచేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. నర్సరీలో మొక్కలు పెంచాలని, అక్కడున్న వన సేవకునికి రంగన్నకు గ్రామపంచాయతీ కార్యదర్శి రామ్‌రెడ్డి,టీఏ ఉమేరాకి సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామ పంచాయతీ నర్సరీలో ప్రైమరీ బెడ్స్ కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆదే శిం చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్ రెడ్డి , టెక్నికల్ అసి స్టెంట్ ఉమేరా ,వనసేవకుడు రంగన్న, ఫీల్డ్‌అసిస్టెంట్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి..
విరాళం అందించడం హర్షణీయం : కలెక్టర్



జోగులాంబ గద్వాల : ప్రతి సంవత్సరం తనకు వచ్చే ఆదాయంలో సీఎం సహాయ నిధికి విరాళం ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రశంసించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో వడ్డేపల్లి మండలం, కోయిల్ దీన్నే గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జీ. కాంతారెడ్డి , రూ.2 లక్షల డిమాండు డ్రాఫ్టు ను సీఎం సహాయ నిధికి విరాళంగా కలెక్టర్‌కి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి సంవత్సరం మీకు వచ్చే ఆదాయంలో విరాళం ఇవ్వడం సంతోషమని అభినందనలు తెలిపారు.

సీఎంను కలిసిన నారాయణపేట ఎమ్మెల్యే



నారాయణపేట టౌన్ : నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, పేట నియోజకవర్గ ఇంచార్జి కుంభం. శివకుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు పలువురు మం త్రులను సోమవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చిట్టెం.లక్ష్మీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు.. పరిపాలన సౌలభ్యం మేరకు నారాయణపేట నియోజకవర్గం లో కొత్తగా గార్లపాడు, కోటకొండ, కానుకుర్తి గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమా వేశంలో 69 జీవోపై పూర్తిస్థాయి వివరాలు వెల్లడించిన నేపథ్యంలో సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ పథకానికి వెంటనే నిధులు మం జూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. నారాయణపేట నియోజక వర్గం అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి సహకరించాలని సీఎంకు ఎమ్మెల్యే విన్నవించుకు న్నట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు వారి మాతృమూర్తి చిట్టెం లక్ష్మి ఉన్నారు. సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ శాఖ,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుని,రోడ్డు రవాణా,బిసి వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి



జోగులాంబ గద్వాల : ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదే శించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా వాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 85 పిర్యాదులు సమర్పించారని, వాటిలో ధరణికి సంబంధించిన భూ సమ స్యలపై 57 , ఆసరా పింఛన్లు 8, తదితర సమస్యలకు సంబం ధించి 20దర ఖాస్తులు వచ్చాయని తెలిపారు. మండలాలకు సంబం ధించిన పలు గ్రామాల ప్రజలు ఇచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. సంబ ంధిత మండల తహసీల్దార్లతో మాట్లాడి ఆన్లైన్ రికార్డు చెక్ చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్క రించాలనీ ఆదేశించారు. భూ సమస్యలకు సంబం ధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అపూర్వ చౌహాన్ , రెవెన్యూ కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు ,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

- అతిథి ఆధ్యాపకులు

ఉండవల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి ఆధ్యాపకుల జీతాలు చెలించాలని అతిథి ఆధ్యాపకులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆరు నెలల నుంచి వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఉపాధి సిబ్బంది జీతాలు చెల్లించాలి

ఉండవల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేసే సిబ్బందికి జీతాలు చెల్లించాలని ఉపాధి హామీ సిబ్బంది కోరారు. గత మూడు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు పనులు కల్పిస్తున్న ప్రభుత్వ మాత్రం జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికీ రవణ చార్జీలో కూడా ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి ఉన్నదని తెలిపారు . అధికారులు స్పందించి జీతాలు విడుదల చేయాలని కోరారు.

సివిల్ ఫిర్యాదులను కోర్టు ద్వారానే.. పరిష్కరించుకోవాలి : ఎస్పీ

నారాయణపేటటౌన్ : సివిల్ ఫిర్యాదులను కోర్టు ద్వారానే.. పరిష్కరించుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 4 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. బాధితుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించాల్సిందిగా సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐ,ఎస్ఐ లకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరి ంచుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. బాధితులు తీసుకొవచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో సంభందిత పోలీస్ అధికారులకు సూచించారు. పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగు తున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్నదానం



గట్టు : మండలంలోని మాచర్ల గ్రామంలోని చెన్నకేశవస్వామి, రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద శివ స్వాముల ఆధ్వర్యంలో సోమవారం అన్న దానం చేశారు. కార్తీక మాసం నెలరోజులు ముగించుకొని గ్రామంలోని బిక్షా టన చేసి ప్రతిరోజు శివాలయంలో స్వామివారికి అభిషేకం చేశారు. సోమ వారం ఆలయం దగ్గర అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నారాయణపేటటౌన్ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి మందిరంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్య తనిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణ వినతులపై తీసుకున్న చర్యల పై ఫిర్యాదు దారులకు తప్పని సరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజా వాణి సైట్ లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





నిబంధనల మేరకు.. ఇటుక బట్టీలు నడపాలి..

నారాయణపేట జిల్లాలోని ఇటుక బట్టీల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాల యంలోని ప్రజావాణి హాలులో ఇటుక బట్టీల యజమా నులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలను నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటుక బట్టీల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలు ఈ సందర్భంగా వివరించారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్ కుమార్త, ఇటుక బట్టీల యజమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు : కలెక్టర్



జోగులాంబ గద్వాల : ఓటర్ల సౌకర్యార్థం పలు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులకు ప్రతిపాదనలు రూపొందించడం జరుగుతుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం ఐ డీ ఓ సీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతి నిధులు, ఎన్నికల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సం ఘం నిబంధనలను అనుసరిస్తూ జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులకు సంబం ధించిన ప్రతిపాదనలు రూపొందించడం జరుగు తుందన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వేరే ప్రాంతానికి తరలించాల్సిన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒకే పోలింగ్ స్టేషన్ లో విలీనం అయ్యే పోలింగ్ కేంద్రాల వివరాలతో కూడిన ప్రతిపాదనలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా చర్చించారు. 1400 పైగా ఉన్న ఓటర్లు కలిగిన పోలింగ్ స్టేషన్ల పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు, కొత్తగా ఏర్పడిన కాలనీల పరిధిలో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు, రెండు కిలోమీటర్లు అంతకంటే ఎక్కువ దూరంలో పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మార్పులు, చేర్పులు జరిగిన పోలింగ్ కేంద్రాల గురించి ఓటర్లకు తెలిసేలా చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలపై కలెక్టర్ వారికి అవగాహన కల్పిస్తూ, సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశం లో ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాస్, సీ సెక్షన్ సుపెరిడేంట్ నరేష్ , తహసీల్దార్ మంజుల, విజయ కుమార్ , రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన మెరుగ్గా ఉండేలా కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్



నారాయణపేటటౌన్ : ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యాబోధన మెరుగ్గా ఉండేలా ఉపా ధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. సోమవారం పెద్ద చింతకుంట , పూసలపాడు గ్రామాలలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూళ్లను తనిఖీ చేశారు. విద్యా బోధన మధ్యాహ్న భోజనం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు ఉపాధ్యా యుడిగా వ్యవహరించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను తీర్చిదిద్దాలి..

ప్రభుత్వం అందించే శిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మాగనూరు కృష్ణ మండలాల పరిధిలోని ఉపాధ్యా యులకు రైతు వేదిక మాగనూర్ లో ఏర్పాటు చేసిన ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ ద్వారా ఉపాధ్యాయులకు విద్యాబోధనలో మెలకు వలను వివరించారు.

విద్యార్థులకు అవగాహన : షీ టీమ్



నారాయణపేటటౌన్ : నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆ దేశాల మేరకు.. ఉమెన్ సేఫ్టీ వింగ్ , యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీమ్ ఇంచార్జి ఏఎస్ఐ శ్రీదేవి ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌లోని ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా హరాస్మెంట్, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్స్, గృహ హింస, షీ టీమ్స్, భరో సా సెంటర్, బాల్య వివాహాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీదేవీ మాట్లాడుతూ మహిళలపై, చిన్నపిల్లలపై జరుగు తున్న అఘాయిత్యాలను అరికట్టాలనే ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యుక్తవయసులో ఉన్న తమ పిల్లల దైనందిన కార్యకలాపాలను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని, బాల్యవివాహాలను ప్రోత్స హించే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నారాయణపేట జిల్లా పరిధిలో మహిళల, విద్యార్థుల రక్షణ, భద్రతకు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, ఎలా ంటి ఆపద సమయం లోనైనా షీ టీమ్ నంబర్ 8712670398కి ఫిర్యాదు చేయవచ్చని సూచి ంచారు. మంచిగా చదువుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేలా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పోలీసు శాఖ తరపునే కాకుండా ఇతర శాఖల ఆధ్వర్యంలో కూడా ఇకపై నిత్యం ఇలాంటి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. ఆపదలో ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్స్ 1930,108,100,112 లకు ఫోన్ చేసి పోలీసు తదితర శాఖల యంత్రాంగం సేవలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కూడా మహిళలపై, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘా యిత్యాలను నిరోధించేందుకు బాధ్యతగా కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీ టీమ్ పోలీసులు బాల్ రాజ్, సమిన, లయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నారాయణపేటటౌన్ : నారాయణపేట జిల్లా పరిదిలోని వివిధ మండలాల్లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 10 గం టల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ నందకిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కే.వీ మరికల్ అప్పక్ పల్లి 132 కే.వీ. లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మరికల్, అప్పంపల్లి, ఎక్లాస్ పూర్, వెంకటాపురం, అప్పక్ పల్లి, కొండాపూర్, ధన్వడ,కోటకొండ, కోల్లంపల్లి, చిన్నజట్రం, సిం గారం, పేరపళ్ళ, నిడుగుర్తి ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలోని వివిధ గ్రా మాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.వ్యవసాయ రంగానికి చెందిన రైతులు, గృహ వినియో గదారులు , పరిశ్రమల రంగానికి చెందిన యజమానులు ఈ అంతరా యానికి సహకరించాలని కోరారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

- సీపీఐ (ఎం ఎల్) ప్రజాపంథా నాయకులు



ధన్వాడ : స్వాతంత్ర్య సమరయోధులు, భారత జాతీయోద్యమ విప్లవకారుడు షాహిద్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని సీపీఐ (ఎం ఎల్) ప్రజాపంథా పార్టీ నారాయణపేట జిల్లా నాయకులు బోయిన్‌పల్లి రాము, ఊట్కూరు మండల కార్యదర్శి రామాంజనేయులు, పాతపల్లి సర్పంచ్ జీ. కృష్ణ పిలుపు ఇచ్చారు. సోమవారం ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి సమాజానికి భగత్ సింగ్ ఆలోచన విధానం చాలా అవసరం ఉందన్నారు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అసమానతలు, స్త్రీ, పురుష అసమానతలు లేని వ్యవస్థ రావాలని ఆకా ంక్షించారు. దేశం కంటే, దేశ ప్రజలకంటే నా ప్రాణం గొప్పది కాదన్నారు. దేశ భక్తి అంటే దేశ ప్రజలను కులం పేరుతో, మతం పేరుతో విడదీయడం, దేశ సంపదను సామ్రాజ్యవాదులకు, పెట్టుబడి దారులకు అమ్మడం కాదని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడమే నిజమైన దేశ భక్తి అన్నారు. ప్రజల సంపద ప్రజలకు చెందేలా చేయడం దేశభక్తి అన్నారు. ఇలాంటి ఆలోచనలు ముందుకు తీసుకుపోవడం నేటి యువత భుజాలపై ఉందని, అందుకు అందరూ కంకణ బద్ధులు కావాలని పిలుపు ఇచ్చారు. భగత్ సింగ్ నిత్యస్ఫూర్తి కొనసాగించడం కోసం ఈ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. డిసెంబర్ 21, 2023న జరిగే విగ్రహావిష్కరణకు ఆవిష్కర్తగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎల్ పద్మ, ఎం. కృష్ణ, నారాయణ పేట్ జిల్లా కార్యదర్శి బీ. రాము, మక్తల్ డివిషన్ కార్యదర్శి ఎ. సలీమ్, ఐ ఎఫ్ టీ యూ జిల్లా అధ్యక్షులు ఎస్. కిరణ్, పీ డీ ఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ. భాస్కర్, పీ వై ఎల్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ , పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు శారదా తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. ధన్వాడ మండలం పాతపల్లి గ్రామంలో ఈ నెల 21 జరిగే విగ్రహావిష్కరణలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీ డీ ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలు, పీ వై ఎల్ జిల్లా నాయకులు తిరుమలేష్, నాయకులు అందరి రవి, గోవర్ధన్, ఎ ఐ పీ కేఎం ఎస్ యాంకె నరసింహులు , కథలు నాయకులు పేరప్ప, వై రాజు, రాములు, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్ : ఈ నెల 21న పాత పల్లి గ్రామంలో షహీద్ భగత్ సింగ్ విగ్రవిష్కరణ చేపట్టనున్నట్లు పీ వై ఎల్ , పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు . సోమవారం మండలంలోని బిజ్వా ర్ గ్రామ శ్రామిక భవన్ లో పీ వై ఎల్, పీడీఎస్ యూ నాయకులు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, రవి మాట్లాడుతూ ధన్వాడ మండలం పాతపల్లి గ్రామంలో ఈనెల 21 షహీద్ భగత్ సింగ్ విగ్రహావిష్కరణ ను ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యతో ఆవిష్కరణ కొనసాగుతుందన్నారు. యువతీ యువకులు విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. భగత్ సింగ్ జీవితం నేటి యువతరానికి ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోర్ల నర్సింలు , కొండప్ప , పిరికి రాము, తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిలను ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణంలో కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది కాంగ్రెస్ నాయకుడు బాల ముకుంద ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. నవతెలంగాణ-కుల్కచర్ల





అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులతో కాసేపు ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం వరం లాంటిది అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యమ్మ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, శరత్ కుమార్‌రెడ్డి, కర్రే భరత్ కుమార్, ఆంజనేయులు, బాలముకుందం, జోగు వెంకటయ్య, హనుమంతు ముదిరాజ్, కడుమూరు ఆనందం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కుల్కచర్ల

టెక్నికల్ కోర్సు పరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోండి

- డీఈఓ గోవిందరాజులు

నవతెలంగాణ కందనూలు



డ్రాయింగ్, టైల రింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్ అండ్ హైయర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవింద రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా యందలి 7వ తరగతి ఎగ్జామినేషన్లో ఉత్తీర్ణత సాధించిన వారు లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్షకు హాజరు కావడానికి అర్హులని, లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్ష లేదా లోయర్ గ్రేడ్కు సరిసమానమైన టెక్నికల్ పరీక్ష పాసై వారు సంబంధిత గ్రేడ్లో హైయర్ గ్రేడ్ పరీక్షకు హాజరు కావడానికి అర్హులని ఆయన తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని 2024 సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించే పరీక్షకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.ఈ పరీక్షలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు %ఓఓఓ. ఎంవ.¯వశ్రీుఅస్త్రుఉ.స్రశీఐ.ఱఅ% అను వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలనితెలిపారు. డౌన్లోడ్ చేసిన వెబ్ దరఖాస్తులను జిల్లా విద్యా అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలు అండ్ బోర్డులు జారీ చేసిన ఉత్తీర్ణత సర్టిఫికెట్లు కలిగిఉన్న అభ్యర్థులు అకడమిక్ లేదా టెక్నికల్ క్వాలిఫికేషన్లు ఉన్న వారు తెలంగాణ, హైదరాబాద్లోని ప్రభుత్వ పరీక్షల నుండి ముందస్తు అనుమతిని తీసుకోవాలని తెలిపారు. ఈనెల 29వ తేదిలోపు జిల్లా విద్యాధికారులకు డ్రాయింగ్ లోయర్ రూ 100లు, హైయర్కు రూ 150 లు, వెబ్ అప్లికేషన్ ఫారమ్లను అందజేయాలన్నారు. టైలరింగ్ లోయర్ రూ.150లు, హైయర్ రూ.200లు, లెట్ రూ. 50లతో జనవరి 5వ తేదిలోపు ఫీ చెల్లించిన మరుసటి రోజు ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తు ఫారమ్ను డిఇఓ కార్యాలయం నాగర్ కర్నూల్ నందు సమర్పించాలని డిఈఓ తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులకు బోధించాలి



నవతెలంగాణ మగనూర్

వెనుకబడిన విద్యార్థులకు చక్కగా బోధించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. ఉమ్మడి మాగనూర్ మండలంలోని ప్రాథమిక మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్, ఎల్ ఎం మరియు జాలి ఫోనిక్స్ పై మాగనూరులోని రైతు వేదిక సమావేశంల నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ వారు విద్యా వ్యవస్థలోని అనేక సమస్యలు, సాధించాల్సిన విధానాలను ఉపాధ్యాయులకు తెలియజేస్తూ ఇబ్బంది పడుతున్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రంథాలయ పిరియడ్ ను తప్పక నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు కృత్యాలనిర్వహణ ద్వారా బోధన చేయాలని,తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ ని రాయాలని తెలియజేశారు.పదాల ఉచ్చారణ ద్వారా విద్యార్థులు సులభంగా ఇంగ్లీష్ నేర్చుకునే అనేక మెలకువలను జల్లిఫోనిక్స్ శిక్షణార్థుల ద్వారా మండల ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇవ్వడంతోపాటు, ఉపాధ్యాయుడు అనేక మెలకువలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ , ఉమ్మడి మండల విద్యాధికారి వెంకటయ్య , ఉమ్మడి మండలాల మండల నోడల్ అధికారులు శ్రీనిజాముద్దీన్ , వెంకటయ్య మరియు కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు నరసింహులు ,శివ శంకర్, శ్రీనివాసులు, కే శ్రీకాంత్ , భాస్కర్ రెడ్డి , నరేందర్ , రాజుగారు, రాఘవేంద్ర , రషీద్ , లక్ష్మణ్ , అపర్ణ గారు, జానకిరామ్ ఉమ్మడి మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్
- రావిచేడ్ లో వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

నవతెలంగాణ-ఆమనగల్

దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్ అన్నారు. కడ్తాల్ మండలంలోని రావిచేడ్ గ్రామంలో సోమవారం వైభవంగా జరిగిన అయ్యప్ప మహా పడిపూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి దీక్షా పరునిలో అయ్యప్ప స్వామి కొలువై ఉన్నారని చెప్పుకొచ్చారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, సర్పంచ్ భారతమ్మ విఠలయ్య గౌడ్, గురుస్వామి డాక్టర్ శ్రీనివాస్, కడ్తాల్ మాజీ సర్పంచ్ వేణు గోపాల్ పంతులు, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, నాయకులు రమేష్ గౌడ్, పారేషా, రాఘవేందర్, శంకరయ్య, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

- జడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్
- చరికొండ గ్రామంలో సీసీ రోడ్డు, అండర్ డ్రయినేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆమనగల్

సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని జిల్లా పరిషత్ గ్రామీణాభివృద్ధి శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కడ్తాల్ మండల జడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండలంలోని చరికొండ గ్రామంలో గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.25 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులతో పాటు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత మురికి కాలువ నిర్మాణ పనులను సోమవారం స్థానిక సర్పంచ్ భారతమ్మ నర్సింహగౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ పంచాయతీ నిధుల నుంచి లక్షల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టేలా చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రజా ప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని రావిచేడ్ గ్రామంలో జరిగిన అయ్యప్ప స్వాముల మహా పడిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి, రావిచేడ్ ఎంపీటీసీ సభ్యులు బొప్పిడి గోపాల్, రైతు సమన్వయ జిల్లా కమిటీ సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ నరేష్, నాయకులు లాయఖ్ అలి, బాలకృష్ణ, రమేష్ యాదవ్, జితేందర్ రెడ్డి, బాలరాజు, జంగయ్య, సాబేర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల పాలైన అంజన్న స్వామి..

- దేవుడినే అప్పులపాలు చేసిన ఘనులు.
- భక్తుల సొమ్ము.. స్వార్థపరుల పాలు.
- వాయిదా పడిన జాతర టెండర్లు.
- రికవరీ కానీ గత బకాయిలు.
- అన్నీ ఉన్న అభివృద్ధి శూన్యం.
- చోద్యం చూస్తున్న అధికారులు.

నవతెలంగాణ - ఊరుకొండ



ఊరుకొండపేట పబ్బతి ఆంజనేయస్వామి ఆలయానికి లక్షల్లో ఆదాయం వస్తున్న స్వామి వారు మాత్రం అప్పుల పాలయ్యారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభయ ప్రదాతగా.. గొప్ప మహిమలు గల దేవుడిగా పేరుగాంచిన నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండ పేట శ్రీ పబ్బతి ఆంజనేయస్వామివారికి ప్రతి మంగళ శనివారాలు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడంతోపాటు స్వామివారికి బంగారం వెండి అభరణాలతో పాటు లక్షల డబ్బులు కానుకలుగా సమర్పించినప్పటికీ కొంతమంది ఘనులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని తమ స్వలాభాల కోసం అవినీతి అక్రమాలకు పాల్పడడంతో ఆలయంలో లడ్డు ప్రసాదాలు చేస్తున్న వారికి సుమారు 3.7 లక్షలు, స్వామివారి కండువాల దుకాణదారుడికి లక్ష 70వేలు స్వామి వారు అప్పుల పాలు కావడం హాస్యాస్పదంగా ఉందని మండలంలోని పలు గ్రామాల భక్తులు వాపోతున్నారు. గతంలో స్వామివారి ఆలయ ఆదాయం కోటి నలభై లక్షలు ఉండగా ప్రస్తుతం 74 లక్షలు మాత్రమే ఉండడంపై పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన సిసి రోడ్లు, మరుగుదొడ్ల బిల్లులు పెండింగ్లో ఉండడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. స్వామివారి ఆధ్వర్యంలో వందల ఎకరాల్లో దేవాలయ భూములు ఉన్నప్పటికీ భూముల నుండి వచ్చే కౌలు డబ్బులు సైతం లెక్క దొరకకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు. అంజన్న స్వామికి అన్ని విధాలుగా ఆదాయం ఉన్నప్పటికీ.. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా.. అభివృద్ధి మాత్రం కనీస మౌలిక వసతులు, తీర్థ ప్రసాదాలు, కొబ్బరికాయలు నాణ్యతగా లేకపోవడం మూలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారికి కానుకలుగా సమర్పించిన ఎన్నో డబ్బులు రసీదుల్లో తక్కువ చూయించి ఎక్కువ మొత్తంలో కాజేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన కొబ్బరికాయలు, లడ్డు ప్రసాదాలు, తలనీలాలు, పూజా సామాగ్రి, కొబ్బరి చిప్పలు, పలు దుకాణాల కోసం ఏర్పాటుచేసిన టెండర్లు అధికారుల అలసత్వం పట్టింపులేని ధోరణి మూలంగా వాయిదా పడటం గమనార్హం. గత టెండర్ల డబ్బులు, దేవాలయ భూముల కౌలు డబ్బులు పూర్తిస్థాయిలో మొత్తం చెల్లించకపోవడం మూలంగానే టెండర్లు వాయిదా వేశామని ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతి అక్రమాలకు తావెలేనట్టు దేవుడి సొమ్ము కూడా కాజేయడం.. లెక్కలు సరిగా తేల్చకపోవడం సిగ్గుచేటని పలువురు భక్తులు మండి పడుతున్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అంజన్న దేవాలయానికి సరైన అధికారులు లేకపోవడం.. పాలకమండలి అస్తవ్యస్తంగా ఉండడం.. ఇన్చార్జి ఈవో సక్రమంగా విధులు నిర్వహించకపోవడం మూలంగానే ఇలాంటి దుస్థితి నెలకొంది అని పలువురు భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నత అధికారులు స్పందించి గొప్ప పేరు ప్రఖ్యాతులు కలిగిన శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో పూర్తిస్థాయి ఈవోను, నూతన పాలక మండలి ఏర్పాటు చేసి స్వామి వారి ఆదాయాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భక్తులు కోరుతున్నారు. దేవాలయ టెండర్లలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తిగా నిబంధనల ప్రకారం డిపాజిట్ డబ్బులు తీసుకొని వచ్చిన ఎంతోమంది వ్యాపారులు టెండర్లు వాయిదా పడడంతో నిరాశతో వెనుదిరిగారు. ఆలయ టెండర్లు వాయిదా పడటంపై ఈఓ శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా.. గతంలో టెండర్లు దక్కించుకున్న వారు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం మూలంగానే ఆలయ టెండర్లు వాయిదా వేయడం జరిగిందని.. ఈనెల 21లోగా డబ్బులు చెల్లిస్తే అదే రోజు తిరిగి టెండర్లు వేస్తామని పేర్కొన్నారు. ఆలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై వివరణ కోరగా లెక్కలు చూసి సరి చేస్తామని తెలిపారు.

కోటి మంది కార్మికులకు న్యాయం చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జయలక్ష్మి

నవ తెలంగాణ వనపర్తి



73 షెడ్యూలు ప్రకారం పరిశ్రమలు గత పది సంవత్సరాలుగా వేతనాల సవరణ జరగక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, 73 షెడ్యూల్ పరిశ్రమల వేతనాల సవరణ చేసి కోటి మంది కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జయలక్ష్మి అన్నారు. వనపర్తి జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా కమిటీ సమావేశం ఏం. రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరిందని ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పడం సంతోషకరమ న్నారు. ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తామనడం చాలా సంతోషమని, ప్రగతి భవన్ ను, ప్రజా భవన్ గా మార్చి ప్రజల నుంచి వినతి పత్రాలు తీసుకోవడం బాగుంద న్నారు. కార్మికుల సమస్యల పైన కూడా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో నిర్దిష్టంగా అంగన్వాడీ, ఆశ ఇతర కార్మికుల సమస్యలను నిర్దిష్టంగా పేర్కొంటూ వేతనాలు పెంచుతామని, మిగతా సమస్యల పైన హామీలు ఇవ్వడం జరిగిందని వాటిని కూడా ఆరు గ్యారెంటీ లతోపాటు కార్మికుల సమస్యల పైన కూడా తక్షణం పరిష్కారం చేయాలని కోరారు. స్కీం వర్కర్లకు అంగన్వాడి, ఆశా కార్మికులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, గ్రామ పంచాయతీ మున్సిపల్ తదితర రంగాల కార్మికులతో పాటు అసంఘటిత రంగ మైన హమాలీలు ,ట్రాన్స్పోర్ట్ తదితర కార్మికుల సమస్యలను కూడా పరిష్కారం చేయాలన్నారు. వారికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సమగ్ర శాసనం చేయాలని కోరారు. వనపర్తి జిల్లాలో స్థానిక సమస్యలైన డీసీఎల్ కార్యాలయం లేదని, నేటికీ ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ కార్యాలయమే కొనసాగుతుందన్నారు. కొత్తగా అయిన జిల్లాల్లోనూ వెంటనే కొత్త జిల్లా కార్మిక శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ప్రసంగిస్తూ వనపర్తి జిల్లాలో లక్ష మంది కార్మికులు ఉన్న ఈఎస్ఐ దవాఖాన లేకపోవడం బాధాకరమని వెంటనే కార్మికులకు ఈఎస్ఐ దావకాన వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. వనపర్తి జిల్లాలో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లకు గత మూడు నెలలుగా వేతనాలు రాలేదని వెంటనే చెల్లించాలన్నారు. ముక్కిపోయిన పురుగు పట్టిన పప్పు, చెడిపోయిన గుడ్లు ఇస్తున్నారని వాటిని వెంటనే మార్చి మంచి గుడ్లు , పప్పు అందజేయాలి కోరారు. ఆశా వర్కర్లకు ఒక నెల జీతం రావాల్సి ఉందని వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్యన్ రమేష్, గోపాలకృష్ణ ,ఎస్ రాము, గంధం మదన్ ,జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశు, సూరి ,దాసు, నందిమల్ల రాములు ,ఉషన్న, రంజాన్, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి.



నవతెలంగాణ కందనూలు

మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ కి ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ వినతి పత్రం అందించడం జరిగింది. డిసెంబర్ 9న తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. కానీ ఈ ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలు ఉన్నాయి, అందుకని హేతుబద్ధంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సవరించాల్సి ఉంది దానికోసం రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మ సమాజ్ పార్టీ కొన్ని సూచనలు చేయదల్చింది. అవి అమలు చేయాలని ఈ క్రింద డిమాండ్స్.. బస్సులో ఈ మహిళ ఉచిత ప్రయాణాన్ని తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము. నెలకు లక్ష రూపాయలు సంపాదించే మహిళా ఉద్యోగస్తుల కు ఉచిత ప్రయాణాన్ని వర్తింప చేయకూడదు..ఈ ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికుల పై పడుతుంది తద్వారా ఆటో కార్మికులకు తీవ్ర నష్టానికి గురవుతున్నారు ఈ నష్టాన్ని భరించడానికి ఆటో నడిపే కార్మికుడికి నెలకు ?3,000 చొప్పున ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సాయి మహారాజ్ గారు, ఉపాధ్యక్షుడు సురేష్,కరాటే రాజు, మల్లేష్,విష్ణు,శ్రీకాంత్,శేఖర్,సాయి, రవి కుమార్,నరేందర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వినతి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామం 13 వార్డులో ల్యాండ్ మార్క్ కాలనీలోని స్నేహపురి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని, కొద్దీ మేర పొడిగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని స్నేహపురి కాలనీ వాసులు తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డికి, తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ లకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ చైర్ పర్సన్, మరియు వైస్ చైర్ పర్సన్‌లు సానుకూలంగా స్పందించి, రాబోయే బడ్జెట్ సమావేశం లో ఈ పనులకు ఆమోదం తెలిపి, పనులు చేపడుతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు బొక్క వంశీధర్ రెడ్డి, స్నేహపురి కాలనీ అధ్యక్షులు రాంరెడ్డి, ఉపాధ్యక్షులు గౌరిశంకర్, సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య, కార్యదర్శి అచ్యుత్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గోపాల్, కాలనీ వాసులు లవకుమార్, ధనరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా ఉంటాం





- డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి
- మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-ఆమనగల్

ఆపద సమయంలో అండగా ఉంటామని డీసీసీ అధికార ప్రతినిధి, కడ్తాల్ ఎంపీటీసీ సభ్యులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన చెందిన డి.జంగయ్య అనారోగ్యంతో బాధపడుతు ఆదివారం మృతి చెందాడు. అదేవిధంగా ఇటీవల పోస్టాఫీసు కాలనీకి చెందిన సత్తార్ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. తనవంతు తక్షణ సహాయంగా వారికి రూ.5 వేల చొప్పున ఒక్కొక్కరికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ముత్తి అంజయ్యను ఆయన పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, మాజీ సర్పంచ్ వేణు గోపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గురిగల్ల లక్ష్మయ్య, వార్డు సభ్యులు, నాయకులు మల్లయ్య, రాంచందర్ నాయక్, మంకీ శ్రీను, బిక్షపతి, జహంగీర్ అలీ, మలే మల్లేష్ గౌడ్, సత్యం యాదవ్, మహేష్, ఇమ్రాన్ బాబా, శ్రీకాంత్, రామకృష్ణ, రమేష్, శ్రీను, మధు, సాయి, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

